International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-12(5), December, 2016
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

# సమకాలీన సమాజంపై చలం భావాల ప్రభావం

**నీరడి భాగ్యలక్ష్మి**
పరిశోధక విద్యార్థి
తెలంగాణ విశ్వవిద్యాలయం
డిచ్‌పల్లి, నిజామాబాద్.

ఏ సమాజంలోనైనా వ్యక్తిని సమాజం, సమాజాన్ని వ్యక్తులు భావ భౌతిక రూపంలో ప్రభావం చేయడం సహజం. సమకాలీన వ్యవస్థపైన తదనంతర సాహిత్యంపైన చలం ప్రభావం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వుందనేది వాస్తవం. 'చలం శ్మశాన సాహిత్యం' అని ఒకరు, దీన్నే ఇది 'నిశితపరిశీలనా? దగాకోరు పరిశీలనా?' అని ఇంకొకరు చలం సృజనాత్మక సాహిత్యంపై వాదోపవాదాలు జరిపారంటే అతని రచనలకున్న తీవ్రత, దాంట్లో సామాజిక సమస్యల నేపథ్యం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. చలం సృజనాత్మక రచనల్ని చదివిన వారు చలం వ్యతిరేకులుగానో, అభిమానులుగానో, భక్తులుగానో సమన్వయవాదులుగానో కనిపిస్తారేకాని వట్టి పాఠకులుగా మాత్రం కనిపించరు.

చలం సృజనాత్మక సాహిత్యంపై కృషి చేసిన వాళ్ళు ఎందరో ఉన్నారు. గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రంగనాయకమ్మ, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, కోడూరి శ్రీరామమూర్తి, కె.వి. రమణారెడ్డి, ఆర్.ఎస్ సుదర్శనం, లక్ష్మీ, ఇస్మాయిల్, సంజీవమ్మ, నవీన్, హరి మొదలైనవారు తమతమ అవగాహన మేరకు స్వతంత్ర భావాలను ప్రకటించారు. అడపాదడపా నిఖిలేశ్వర్, వరవరరావు, ఆనందారామం, లత, త్రిపురనేని మధుసూదనరావు, హరి మొదలగువారు కూడా వెలిబుచ్చారు. అప్పుడో వ్యాసం ఇప్పుడోవ్యాసం రాసిన వారు వాదోపవాదాలు వేసుకున్నవారు ఎందరెందరో ఉన్నారు. వీరందరితో పాటు విశ్వవిద్యాలయాల పరిధిలో చలం సాహిత్యంపై పరిశోధన చేసిన వారిలో వావిలాల సుబ్బారావు, ఎన్. రామచంద్ర, ఎన్. బీనా, కె.యస్. రమణ, ఈదారెడ్డి వున్నారు. వీరంతా చలం సాహిత్యాన్ని సమగ్రంగా అవగాహన చేసుకున్నవారే.

పైన ఉదహరించిన వారేకాక కొన్ని వందల మంది చలం రచనలపైన చిన్న చిన్న వ్యాసాలు రాసి చలం అభిప్రాయాలతో ఏకీభవించడమో, వ్యతిరేకించడమో చేశారు. చలంపై ఏ రకమైన రచనలు చేయని అభిమానులు, పాఠకులు, మౌఖిక విమర్శకులు కొన్ని వేల సంఖ్యలో ఉన్నారు.

అంటే ఆంధ్రుల మీద, ఆంధ్ర సాహిత్యం మీద, స్త్రీ స్వేచ్ఛ కోరే సంఘాల, సంస్థల మీద ముఖ్యంగా యువతరం మీద చలం ప్రభావం ఉంది.

లోపభూయిష్టమైన వ్యవస్థను దాని నియమాలను చలం వ్యతిరేకించారు. సామ్యతలేని స్త్రీ పురుష సంబంధాలను ఖండించాడు. వివాహం ద్వారా ఒకటయ్యే స్త్రీ పురుష సంబంధాల్లోని అసమానతల్ని హింసించే నియమాల్ని, ధర్మాల్ని వ్యతిరేకించాడు. స్త్రీపట్ల నెలకొన్న పురుషాధిక్యతను ద్వేషించాడు, నిరసించాడు, ఆక్రోశించాడు, తిరగబడ్డాడు. మంచికో చెడ్డకో స్త్రీ ప్రక్కన నిలబడి సిన్సియర్‌గా తన అభిప్రాయాలను వ్యక్తీకరించాడు. లోపరహిత సమాజం కోసం, స్త్రీ పురుష సమానత్వం గల మరో ప్రపంచం కోసం, సమస్త మానవాళిని కదిలింపచేసేట్టు, చలింప చేసేట్టు. తిరగబడేటట్టు భావాల్ని ప్రకటించాడు. శాస్త్రీయమైన అవగాహన లేని చలం అని కొందరు అంటున్నప్పటికి ఎవరూ స్త్రీ స్వేచ్ఛకోసం గొంతెత్తని కాలంలో స్త్రీ స్వతంత్రత కోసం మూల బీజాలు వెతికిన మహోన్నతమైన వ్యక్తిగా సమసమాజ నిర్మాణానికి సాహిత్యం ద్వారా తిరగబడ్డ వ్యక్తిగా ఆంధ్ర సాహిత్యంలో మిగిలి పోతాడు. నిలిచిపోతాడు. చారిత్రక నేపథ్యంలో తెలుగు సాహిత్యాన్ని అధ్యయసం చేస్తే చలం ఒక విప్లవ కారుడి పాత్రలో కనిపించడు. లోపభూయిష్ఠ సమాజాన్ని, విలువల్ని, నియమాల్ని, ధర్మాల్ని ఎదిరించే తిరుగుబాటు దారుడిగా దర్శనమిస్తాడు. తిరుగుబాటులో ఉత్తుంగా తరంగం చలం ఒక్కడే అనిపిస్తాడు.

సాహిత్యంలో సమాజాన్ని చూసుకునే వారికి, సాహిత్యాన్ని చారిత్రక భావ భౌతిక దృష్టితో విశ్లేషించుకునే వారికి, తిరుగుబాటు మార్గం వేసే సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి, సంస్కార హృదయంతో సమాజాన్ని మార్చాలనుకునే వారికి చలం ఒక్కడే ఆనాడు ఆహ్వానించ దగ్గ వ్యక్తిగా కనబడతాడు.

"కొంతమంది విద్యార్థులు, ఉన్నతోద్యోగులు, రాజకీయాలలో పడ్డ కొందరు వ్యక్తులు మినహాయిస్తే మిగిలినవారు – వర్తకులు, వ్యవసాయదారులు, ప్లీడర్లు, డాక్టర్లు, మాస్టర్లు వారందరు సంసార జీవితాలను చలంగారంతటి ప్రతిభతో చిత్రించిన మరొక రచయిత లేడనుకుంటాను" అని బుచ్చిబాబుగారన్నది అక్షరాల నిజం. స్త్రీలపట్ల వ్యవహరించే, ప్రవర్తించే పురుషుల దుష్ట మనస్తత్వాలను చలం విశ్లేషించినంతటి మానసిక శాస్త్రజ్ఞుడు మరొకడులేడు. స్త్రీ స్వేచ్ఛను, స్వతంత్రతను, సమానత్వాన్ని ప్రబోధించే స్త్రీపాత్రలను చలం ఎన్నుకున్నప్పటికి పురుష పాత్రల్ని, వారి మనోభావాల్ని చాలా కాన్షస్‌గా

చెబుతాడు. అందువల్లే "ఆయన ప్రభావానికి లోనైన వాళ్ళు తక్షణమే రెండు కక్షలుగా చీలిపోయారు. అసంఖ్యాకులు ఆయనకు దాసోహం కాగా మిగిలిన వారు అక్కసు కొద్దీ ఆయన పుస్తకాలు తగిలేశారు" అని గొర్రెపాటి వెంకట సుబ్బయ్య అన్నాడంటె చాల వాస్తవమే అనుకుంటాం కదా!

చలంలో ప్రభావం చేసే గుణాలు మరో రెండు ఉన్నాయి. అతని వచనానికి ఎంత తీవ్రత ఉంటుందో అంతే తీవ్రత చెప్పదలుచుకున్న భావాలకు వుంది. ఈ రెండు అతని రచనా సూత్రం కావడం మూలంగా చదువుకునే పాఠకుడిపై ఇవి వెంటనే ప్రభావం చేయడం వల్ల పాఠకుడు మంచికో చెడ్డకో ముందు ప్రభావితుడవుతాడు. చలం వ్యవస్థపైన, దాని అనుయాయుడైన పురుషుడిపై ఎంత తీవ్రంగా తిరగబడతాడో అంతే తీవ్రతతో పాఠకుడు కూడా తిరుగుబాటు తత్వాన్ని పెంపొందించుకుంటాడు. రావూరు భరద్వాజ కథలు రాసే రోజుల్లో చలం తత్వాన్ని పెంపొందించు కుంటాడు. రావూరు భరద్వాజ కథలు రాసే రోజుల్లో చలం తత్వం అతనిపై ప్రభావం చేయడం వల్ల మూడు నాల్గు సంవత్సరాల పాటు రచనా వ్యాసంగమే మానుకోవాల్సి వచ్చిందట. ఈ విషయం భరద్వాజ నాతో చెప్పారు. ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే చలం రచనకున్న కదిలించే గుణం, నిలదీసే గుణం అంతటిదని చెప్పడానికీ గాని మరొకందుకు కాదు.

మహారచయితలు, విశ్వనాథ సత్యనారాయణ, గుడిపాటి వెంకటచలం రాస్తున్న రోజుల్లో ఏవిధమైన వచనం రాసిన ఆంధ్రుల్ని మెప్పించాలో కుటుంబరావుకి ఓ సమస్యే అయిందట. మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక జీవనానికి అద్దం పట్టిన కుటుంబరావుకు చలం తిరుగుబాటు మార్గం తొక్కక తప్పిందికాదు. చలం ఇన్ఫ్లూయన్స్ వ్యవస్థ మార్పు కోసం కలం పట్టిన ప్రతివారిపైన ఎంతో అంతో ఉండి తీరుతుంది. వ్యవస్థలో చలం ఇన్ఫ్లూయన్స్ ఉండటం మంచికేగాని చెడుకోసం మాత్రం కాదు. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'? అనే నవలపై ఉంది. లేదని ఎవరంటారు? చలపై విమర్శనాత్మక కథ రాసిన గోపీచంద్ పాత్రల్లో ఉంది. లేదంటారా?

సమాజంపై అభ్యుదయ, దిగంబర, విప్లవ కవుల, రచయితలపై మార్క్సిస్టు కవిత్వానికి శ్రీకారం చుట్టిన శ్రీశ్రీపైన చలం ఇన్ఫ్లూయన్స్ వుంది. శ్రీశ్రీ కవిత్వానికి ఆనాడు యోగ్యతా పత్రం ఇచ్చిన గురువు చలంగారే కదా? శ్రీశ్రీ కవిత్వం ఒకయెత్తు చలం యోగ్యతా పత్రం ఒక ఎత్తు అన్న చలం అభిమానులు ఉన్నారంటే చలం ప్రభావం ఎంతటిదో వేరే చెప్పనవసరం లేదు. చలం జీవించిన రోజుల్లో రచనలతో పాటు అతని జీవితం కూడా సమాజంపై ప్రత్యక్ష పరోక్ష ప్రభావం చూపింది.

అతని ఆలోచనల్లోంచి మొలకెత్తిన స్త్రీ పాత్రలు ఆకాశంలోంచి ఊడిపడ్డవి కావు. వాస్తవ జీవితంలో తాను చూసిన, ఎదురుపడినవారే అతని రచనల్లోని స్త్రీ పాత్రలు. అందువల్లే అతని భావవాదం అంతా ఆ పాత్రల చుట్టూ అల్లుకుపోయింది.

చలం స్త్రీ స్వేచ్ఛావాదం, విశ్వనాథ సాంప్రదాయ వాదం రెండూ రెండు మార్గాల గుండా వీచాయి. జాతీయోద్యమ మార్గం వెడల్పు చేసుకునే సంస్కరణ సంధి దశలో చలం సృజనాత్మక సాహిత్య పుట్టుక ప్రారంభమయింది. జాతీయోద్యమ పోరాటం చలం రచనల్లో ఎక్కువగా ప్రతిఫలించలేద కాని అదే కాలంలో వచ్చిన స్త్రీ స్వాతంత్ర్య ఉద్యమ గుణం స్త్రీ సంస్కరణోద్యమ గుణంతో తిరుగుబాటు మార్గం ఎన్నుకున్నవాడనేది గుర్తిస్తే, ఆంధ్రలో చలం ఉద్యమానికి ప్రాధాన్యం ఏర్పడుతుంది.

చలం తిరుగుబాటు అంతా కూడా కుటుంబ సంబంధాల మధ్యే సాగింది. దాంపత్య సౌఖ్యం పురుషదత్త మవుతున్నప్పుడు, దాన్నే వ్యవస్థ సమర్థిస్తున్నప్పుడు పెళ్ళిబంధాన్ని పురుష పాదాక్రాంతమవుతున్న దశలో స్త్రీ వ్యక్తిగా తన స్వేచ్ఛను, తన వ్యక్తిత్వాన్ని తన తిరుగుబాటు తనాన్ని తానే నిర్ణయించుకునాలనే దశలో చలం పాత్రలు కనబడతాయి. చలం వ్యక్తి స్వేచ్ఛను కోరే ఆక్రోశం సామూహికంగా కనిపించకపోయిన సామూహిక తిరుగుబాటుకు సమాయత్తం చేసే ఘోషను తన పాత్రల చేత గొంతెత్తే తిరుగు బాటునాదాన్ని ఆలపించేట్లు చేస్తాడు. వారి అసహాయస్థితిని మొదట చెప్పింది. మంచికో చెడ్డకో చలమే అని అనిపిస్తాడు. చలం పాత్రల వ్యవస్థపైన, పురుషాధిపత్యంపైన, వివాహ వ్యవస్థపై తిరగబడి మంచికో, చెడ్డకో పతనావ్థకు వచ్చినా తమ తిరుగుబాటు సరియైనదనే ప్రబోధిస్తాయి కాని పలాయనం కావు. బానిస బుద్ధిని పెంపొందించుకోవు. పతనావస్థ సంభవిస్తే ఆత్మాహుతినైనా అంగీకరిస్తాయికాని విశ్వనాథ పాత్రల వలె పునరాలోచించి లేచి పోవడం తప్పనో, సంఘంపైన, వివాహ వ్యవస్థపైన, సాంప్రదాయ నియమాలపైన తిరుగుబాటు చేయడం సమంజసం కాదని విచారించవు. క్షమాపణ చెప్పుకోవు. తమ వ్యక్తిత్వాన్ని, స్వతంత్ర ఆలోచనని, కామాన్ని, వ్యామోహాన్ని, ప్రేమని, సామాజిక కుటుంబ పరిస్థితుల్ని, సౌఖ్యాన్ని సంపూర్ణంగా రక్షించుకోవడానికే తిరగబడతాయి గాని లొంగిపోయే మనస్తత్వం పెంపొందించుకోవు. మృత్యువును ప్రేమిస్తాయి కాని వ్యవస్థతో రాజీపడవు. ఈ విధమైన తిరుగుబాటు తత్వం చలం పాత్రలకు ఉండటం మూలంగా విశ్వనాథ సాంప్రదాయగాలికన్న చలం తిరుగుబాటు గాలి వేడిగాలిలా వ్యవస్థ అంతా చుట్టు ముట్టింది.

దాంపత్య సౌఖ్యం దాంపత్యంలో వుంది అనే తత్వం గల మునిమాణిక్యం గారి 'కాంతం' భావాలు గల వాళ్ళు చలం పాత్రల్ని చూసి గగ్గోలుపెట్టి సమాజాన్ని తమ పక్కకు తిప్పుకోవాలని ఇంటింటా అరిచినా విశ్వనాథ తరతరాల పునరుద్ధరణ సాంప్రదాయం, తిట్టి పోసినా చలం తిరుగుబాటు భావవాదం ముందు నిలబడలేక పోయాయి. ఈ ఉదృత హోరు గాలిలో అన్ని కొట్టుకుపోవాల్సిన పరిస్థితే. ఆనాడు ఏర్పడింది. నిజానికి చలం వాదాన్ని మునిమాణిక్యం ఓ విధంగా నిరోధించ ప్రయత్నించినప్పటికి పరోక్షంగా అతని మార్గాన్ని వెడల్పు చేయడానికే ఉపయోగపడింది. చలం ఆత్మకథలో ప్రత్యక్ష స్త్రీల కథనం ఏంటంటే "మీరు మమ్ములను హింసించారంటే మా స్వేచ్ఛకు అడ్డు తగిలారంటే మేము చలం దగ్గరికి వెళతాము అంటారు. మరోచోట "ఆమెకి వెంకటచలం చదవడానికి తన చిత్రాంగినిచ్చాడు. ఆ పుస్తకం చదివిన ఆమె అతనితో మాట్లాడడం మానివేసింది" అని వాస్తవ సన్నివేశాల్ని చూపుతాడు. "If you don't like them, burn my books, But why scorch me with they looks" అనే అనుభవాత్మక జీవితాన్ని పాత్రల పరం చేయడం మూలంగా సామాజిక స్పందనతో కూడిన చలం భావాలు ఇన్ఫ్లూయన్స్ చేయగలరు. సామాన్యమైన పాఠకుడిలో కూడ ప్రతిస్పందనకు గురిచేయగలవు.

చలం సమకాలికులలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, అడవి బాపిరాజు మొదలగువారు సమకాలీన స్త్రీ సమస్యలను పట్టించుకున్నా చలమంత శక్తి వంతంగా, సిన్సియర్‌గా, తాదాత్మ్యం చెంది స్త్రీ స్వేచ్ఛను జీవితాదర్శంగా పట్టించుకుని దాసినంత ఉధృతం వారి రచనల్లో కనిపించదు. చలం తిరుగుబాటు తీవ్రత చలంలో కేంద్రీకృతమై ఉన్నంతగా కూడా ఉండదు. స్త్రీ పురుష సంబంధాలలోని సమానత్వాన్ని ఆనాడు ఏ రచయిత కోరలేదేమో! చలం. ఎన్నెన్నో అఘాతాల నుండి, ఉప్పెనల నుండి ఉవ్వెత్తున పడిలేచిన తిరుగుబాటు కెరటం ఆనాటి సమాజాన్ని తడిపివేసింది. అలా తడిలేచిన సమాజ, సాహిత్యంలో చలం ముద్ర ప్రత్యేకంగా కనబడుతుంది. ఈ విధమైన ముద్ర స్త్రీ స్వేచ్ఛ కోసం ఆనాటి నుంచి కలం పట్టిన వారిలో చలం ప్రభావం ఎంతోకొంత వేళ్ళు పాతుకుని ఉందంటే అతిశయోక్తి కాదు.

త్రిపురనేని గోపీచంద్ రచనల్లో చలం నిజాయితీ కనిపిస్తుంది. చలం స్త్రీ పాత్రల మనః సంఘర్షణ నుంచే గోపీచంద్ స్త్రీ పాత్రల హేతువాద దృష్టి పెంపొందింది. గోపీచంద్ చలం రచనల్ని బాగా చదివాడు. చలంపై సదుద్దేశ్యం ఏర్పడక 'వెంకటాచలం పాత్ర' అనే కథను రాశాడు. చలం

వ్యక్తిత్వాన్ని, అతని పాత్రల వ్యక్తిత్వాన్ని విమర్శనాత్మకంగా ఈ కథలో వ్యాఖ్యానించాడు. చలం భావవాదం గూర్చి గోపీచంద్ కొంత విశ్లేషించుకున్నాడు. అతని పాత్రలపై చలం ముద్ర కొద్దిగా కనిపిస్తుంది. 'మెరుపుల మరకలు' నవల లోని ఉషారాణి పాత్రలో చలం ఛాయలు కనిపిస్తాయి. "మనం కాస్త తెలివిగా ఉండక తప్పదు శ్రీకాంత్ అనవసరంగా పదిమంది నోళ్ళలోను నాని జీవితాలను నాశనం చేసుకోవడంలో అర్థంలేదు" అని అంటుంది. ఉషారాణిలో చలం ఛాయలు ఉన్నా లౌకికురాలిగా కనిపిస్తుంది. ఆమెది కొంత వ్యవస్థ ఎడ్జెస్ట్ అయ్యే మెంటాలిటీగా కనిపిస్తుంది. ఈ తత్వం చలం పాత్రలకు లేకపోయినా ఆ స్కూల్ ఆఫ్ థాట్స్ నుంచే ఉషారాణి పాత్ర రూపు దిద్దుకుంది. చలం స్త్రీ పురుష సంబంధాల మధ్యనెలకొనవలసిన భావాల స్వభావం మాదిరే గోపీచంద్ 'శిథిలాలయం' లో కొంత భర్త యొక్క సౌకుమార్యాన్ని తెలుసుకోవాల్సిన అవసరం అతనికి లేదు. ఆమె భార్య అంతే" అనే నేపథ్యం చలం భావాలనుండే సంక్రమించిందని గ్రహించాలి.

కొడవటిగంటి కుటుంబరావుపై చలం ఆలోచనలు కొంతలో కొంత ప్రభావితుల్ని చేశాయి. కుటుంబరావు స్త్రీ పాత్రల వాతావరణం చలం బాధామయ గాథల నుంచే జనించిందని అనిపిస్తుంది. చలం వితంతువుల దుర్భర బ్రతుకును ఖండిస్తాడు. చలం వేశ్యలపై సానుభూతి చూపిన విధంగా కుటుంబరావు కూడా చూపుతాడు. అతని 'అనుభవం' కథపై చలం వితంతువులపై రాసిన కథల ప్రభావం కనబడుతుంది. అనుభవం కథలో ప్రధాన పాత్రయొక్క భర్త మరణించిన సందర్భంలో అతని భార్య ఈ విధంగా అనుకుంటుంది. "భర్త చనిపోయాడని కాదు అతిహేయమైన వైధవయం తనకు కూడా సంప్రాప్తమైనదని" ఆమె కుమిలి పోతుంది. స్త్రీ పురుషుల మధ్య నెలకొనే ప్రేమను చలం విశ్లేషించిన విధంగానే 'ఆడవలసిన అబద్ధం' లో కుటుంబరావు స్త్రీ పురుషుల మధ్య ప్రేమతప్ప కృతజ్ఞత ఉండరాదంటాడు. వివాహం వల్ల వ్యక్తి స్వేచ్ఛకు హాని కలగకూడదనే చలం భావాల మాదిరే 'పేరులేని పాత్ర'ను, 'చెడిపోయిన మనిషి', 'పెళ్ళికాకుండాచూడు' వంటి కథలలో చలం భావ వాదం కనిపిస్తుంది. చలం స్త్రీని చూసే కోనం నుండి కుటుంబరావు చూడడు కాని సమస్యను పట్టించుకునే పద్ధతి, చెప్పే సిన్సియారిటీ మాత్రం చలం ప్రభావం నుంచే వచ్చింది.

చలం ప్రభావం లత సాహిత్యంలో పొడచూపుతుంది. లత పాత్రల్ని విశ్లేషించుకుంటే ఆమె పాత్రల మనోభావాలు, పద్ధతులు, నడివడి చలం పాత్రల నడకలోంచి నడిచి వచ్చినట్లుగా కనిపిస్తాయి. చలం పాత్రలకున్న నిర్మోహమాటం, నిర్భీతి లత పాత్రలకు కూడా వుంది. లత 'ఊహాగానం' లో

వెలిబుచ్చిన భావాలు చలం ప్రభావం నుండే సంక్రమించాయి. ఊహాఆనందంలో ఇలా అంటుంది. 'చలం పాడు చేయగా శరత్ పాడు చేయగా మిగిలిన దేశాన్ని లత పాడు చేస్తున్నదని. ఇందులో మరో ఘోరం ఏమిటంటే లత స్త్రీ అవటంట" అని అంటుంది. 'రాగజలధి' లో మీనాక్షి, 'చరిత్ర శేషులు' లో వరాలు సంఘనీతిని ఎదిరిస్తాయి. వీరితో పాటు దీంట్లోని మరో పాత్ర శైలూషిలో చలం ప్రభావం ఉంది. శైలూషి లాలసత్వంలోను, 'ఏడారి పువ్వుల' లోనక్లబ్ వర్ణన అవగతం చేసుకుంటూ ఉంటున్నప్పుడు, చలం భావ ఛాయలు కనబడతాయి. "బాహ్య జీవితంలో పతివ్రతని ఆచరిస్తూ మాసిక వ్యభిచారం చేయడం అంతా దౌర్భాగ్యం మరొకటి లేదు. మగవాడికి, ఆడదానికి కూడా స్వతంత్రం నశించి పోకుండా వివాహ వ్యవస్థని దిద్దాలి" అనే విధమైన భావనిర్మాణం అంతాగూడ చలంలోంచి నేర్చుకున్నదే.

చలంకి, రంగనాయకమ్మకు కొన్ని పోలికలున్నాయి. చలం స్త్రీ స్వేచ్ఛా వాదాన్ని సమగ్రంగా అర్థం చేసుకున్న రచయిత్రి. చలం లాగానే రంగనాయకమ్మ తాను నమ్మింది సిన్సియర్‌గా చెబుతుంది. చలంగారిలాగా పురుష మనస్తత్వాన్ని చాలా బలంగా 'ఎక్స్‌పోజ్' చేస్తుంది. అన్ని సంఘటనలు, సందర్భాలు, పరిస్థితులు, వేరు వేరుగా ఉన్నా తిరుగుబాటు సంఘర్షణ మాత్రం చలం తరువాత కుటుంబ సంబంధాలలో రంగనాయకమ్మే ఎక్కువగా పట్టించుకున్నట్లనిపిస్తుంది. పురుషుల్లో ఉండే జెలసీని చలం చెప్పినంత బలంగా చెబుతుంది. పురుషాధిపత్య నిరసం చలం నుంచి సంక్రమించిందే. 'పేకమేడలు' నవలలో భానుమతి భర్తపై తిరుగుబాటు చేసి మరణిస్తుంది. చలం పాత్రలు లొంగిపోని విధంగానే రంగనాయకమ్మ పాత్రలు లొంగుబాటును అంగీకరించవు. 'రచయిత్రి' నవలలో విజయ పురుషాధిపత్యాన్ని ఎదిరించింది. స్వేచ్ఛలేని స్త్రీకి విజ్ఞానం, ధనం ఎన్ని వున్నప్పటికి పురుషాధిపత్య వ్యవస్థలో స్త్రీకి బానిసత్వమే లభిస్తుందని చలంవలెనే రంగనాయకమ్మ విశ్వసిస్తుంది. 'నాకోరిక', చుట్టమై చూడవచ్చి, 'నాకు చచ్చిపోవాలని ఉంది' మొదలగు వాటిలో చలం పాత్రల కుండే మానసిక సంఘర్షణ రంగనాయకమ్మ పాత్రలలో కనిపిస్తుంది.

చలం ప్రభావంతో ప్రస్తుతం రాసేవారిలో నవీన్, కంఠంనేని రాధాకృష్ణమూర్తిని పేర్కొనవచ్చు.

పెళ్ళి సంబంధాలలోని కట్టుబాట్లలోని లోపాలను నవీన్ ఖండిస్తాడు. స్త్రీ విషయంలో సంఘం పాటించే నియమాల్ని కూడా ఖండిస్తాడు. ఖండించేప్పుడు, నిరసించేప్పుడు చలంలో ఎంతటి ఆవేశం ఉంటుందో అంత ఆవేశం నవీన్‌లో కూడా ఉంటుంది. అయితే అది కనపర్చకుండా మానసిక ఒత్తిడి

రూపంలో చూపుతాడు. 'సంకెళ్ళు' నవలలో కిరణ్, అరుణ భార్యభర్తలు. వ్యవస్థాబద్ధమైన నీతిని వ్యతిరేకించే తత్వం కిరణ్‌ది. ఈ నవలలోని మరోపాత్ర రజినిది. రజిని వితంతువు. కిరణ్‌కు సహోపాధ్యాయిని. భర్త చనిపోయినా బొట్టు, గాజులు యధావిధిగా వుంచుకుంటుంది. చలం పుస్తకాలు చదువుతుంది. కిరణ్, రజని ఒకరినొకరు ప్రేమించుకుని సౌఖ్యం పొందుతాడు. ఇద్దరు కలిసి "చలం, శ్రీశ్రీ, గోర్కి, సార్త్ర్, నార్మన్, ఆర్థర, మిల్లర్, లారెన్స్, టెన్నిసీ విలియమ్స్ మొదలైన రచయితలను" గూర్చి మాట్లాడుకుంటారు. "ప్రేమ కార్యంలో స్త్రీ పురుషులిద్దరూ సరిసమానంగా స్వేచ్ఛగా ఏ అచ్ఛాదనలు లేకుండా పాల్గొనడంలో వుండే ఉత్కృష్టమైన ఆనందాన్ని యీ రోజు రజిని నాకు చూపించింది" అని కిరణ్ ఓ చోట అంటాడు. "శృంగార మనేది స్త్రీ పురుషులిద్దరికీ ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరమది. ఆ శృంగార కార్యంలో ఇద్దరూ సరి సమానంగా పాలుపంచుకోవాలి. అప్పుడే ఇద్దరు నిజమైన ఆనందాన్ని అనుభవించగలమని నేను అరుణకు పదే పదే చెప్తుండేవాడిని" అని మరోచోట అంటాడు.

"పరస్పరం ఎలాంటి ఆకర్షణ, అనురాగం, అన్యోన్యత లేకుండా సమాజం కోసమో, ఆ సమాజం మన తలల్లోకి ఎక్కించిన కృత్రిమ విలువలకోసమో, ఏ అందమూ ఆనందమూ లేని గానుగెద్ద లాంటి కాపురం చెయ్యడం కంటె హాయిగా వడిపోవడం నయం కాదంటారా" అని సంభాషణల రూపేణా పలికిన భావాలు చలం భావ సామ్యతకు దగ్గరగా ఉన్నవే. ప్రేమికుల మధ్య, పెళ్ళి సంబంధాలలో రహస్యాలు ఉండని విధానంతో కూడిన వ్యక్తి స్వేచ్ఛ, స్వతంత్రత నవీన్ కోరుకోవడం జరుగుతుంది. ప్రేమ, పెళ్ళి, సంఘంపై చలం దృష్టి మాదిరే నవీన్ దృష్టి కనబడుతుంది. 'సౌజన్య; కాటేసిన కాఠిన్యం' నవలల మానిసిక మనోవిశ్లేషణాత్మకమైనవే అయినా భావ చర్చ, స్త్రీకి జరిగే అన్యాయాన్ని వ్యక్తీకరించే తీరులో చలం ప్రభావం కనిపిస్తుంది.

కంఠంనేని రాధాకృష్ణమూర్తిలో చలం విశ్లేషించిన స్త్రీ పురుష సహజాతాలు కనిపిస్తాయి. కంఠంనేని రచనల్లో ఇన్‌స్టింగ్స్ ప్రబోధం, స్త్రీకి జరిగే అన్యాయం గూర్చి చర్చను లేవనెత్తేప్పుడు చలం భావఛాయా రూపురేఖలు కనబడతాయి. కంఠంనేని 'మానవుడు' నవలలోని సరళపాత్ర చలం భావాలకు దగ్గరైనది.

సరళ పెళ్ళి కాకుండానే గర్భవతి అవుతుంది. అయినా ఆత్మస్థైర్యంతో ఆమె మిత్రురాలైన విమల అన్నగారైన ధనుంజయ సహాయంతో గర్భంతీయించుకుంటుంది. ధనుంజయపై సరళకు

అనురాగం. ప్రేమ ఏర్పడుతుంది. ధనుంజయ, సరళ కామ వాంఛలను తీర్చుకుంటారు. సరళ తనను పెళ్ళిచేసుకోమని ధనుంజయను కోరుకుంటుంది. ధనుంజయ వివాహ వ్యవస్థను ఖండించి పెళ్ళిని నిరాకరిస్తాడు. ధనుంజయను వదిలి అప్పారావుతో పరిచయం పెరిగి అతన్ని పెళ్ళి చేసుకొని సుఖంగా ఉంటుంది. ధనుంజయ కొంత కాలం తరువాత మళ్లీ తటస్థించడం సంభవిస్తుంది. ధనుంజయ, సరళ కలిసి తిరగడంతో అప్పారావులో ఈర్ష్య పెరిగి సరళను హత్య చేస్తాడు.

ఇందులోని ధనుంజయరావు పాత్రలో చలం శశిరేఖలోని సుందరరావు భావాలు మనకు కనిపిస్తాయి. సరళ పాత్రలో చలం 'శశిరేఖ' స్వతంత్రత 'మైదానం' లోని రాజేశ్వరి తిరుగుబాటు తత్వం, 'దైనమిచ్చిన భార్య' లోని పద్మావతి మానసిక సంఘర్షణ సరళలో కలగలుపుగా ఉన్నాయి. ఒక పురుషుని ఆధిపత్యానికి లొంగని స్త్రీ జీవితం ఎంత వేదనాభరితమో సరళ స్వభావంలో నెలకొన్న పరిస్థితి ద్వారా గ్రహించవచ్చు. చలం భావ సామ్యతతో కూడిన కొన్ని వాక్యాలు. "ఎవరో ఒకరు కొంత అణిగి ఉండటం ద్వారానో లొంగి వుండటం ద్వారానో పెళ్ళి విజయ వంతమవుతుంది. అనాది నుంచి ఆడది పురుషుని ఆస్తిగా భావించబడుతుండటంతో, ఆ లొంగి వుండటమనేది స్త్రీకి అన్వయించబడింది"

"నన్నడిగితే ప్రతి మనిషికి కొంత సెక్స్యు స్వాతంత్ర్యం ఉండాలండి. ఇందులో స్త్రీలని, పురుషులని తేడా ఏమీ ఉండకూడదు" వంటి భావ సంబంధమైన వాక్యాలు 'మానవుడు' నవలలో చదువుతుంటే కంఠంనేని రూపంలో చలం ఏమైనా దర్శనమిస్తున్నాడా అనేంత ప్రభావంతో నవల సాగింది. కంఠంనేని రాసిన 'మోహమూ-మైత్రి' 'ఎథింగ్ ఆఫ్ బ్యూటీ' వంటి మొదలగు కథల్లో చలం భావాలు పొడుచుకు వచ్చినట్లు అనిపిస్తాయి.

చలం పాత్రల స్పృహ కంఠంనేనిలోనేకాదు వాసిరెడ్డి సీతాదేవి లోను, రావూరి భరద్వాజలోను, సి.ఆనందరామంలోను, డి.వెంకట్రామయ్య లోను వేరు వేరు పరిస్థితుల్లో వేరు వేరు సందర్భాలలో చలం మార్గం కనబడుతుంది. వీరి మీదే కాదు దిగంబర కవిత్వ ఉద్యమ కవుల మీద, వారి దిగంబర సంకలనాల మీద చలం ఎమోషన్ శైలి ప్రభావం కనిపిస్తుంది.

'ప్రజాసాహితి' సాహిత్య సంస్థలో రంగనాయకమ్మ కున్న సంబంధాలు మొదట చాల ఉన్నతంగా ఉన్నా తరువాత తరువాత భిన్నాభిప్రాయాలు ఏర్పడినాయి. భిన్నాభిప్రాయాలు వారిలో

రావడానికి ప్రధాన కారణం చలమే. చలం రచనలలో ప్రభావం పొందిన కొంత మంది రచయితలలో కూడిన సాహిత్య సంస్థలలో చలం భావాలపై చర్చలు జరిగి మనస్పర్థలు పెరిగి సంస్థలోంచి బయట పడిన సంఘటనలు చలం వల్లనే జరిగాయంటే అతని రచనకున్న తీవ్రత, అతని భావాలు సమాజాన్ని ఎంతటి ప్రభావం చేయగలవో ప్రత్యక్షంగా జరిగే సందర్భాలే అప్పుడప్పుడు రుజువు చేస్తూ వుంటాయి. చలం భావం ఎంతటి ప్రభావం చేస్తుందంటే ఇప్పటికి భార్యల చేత చలం సాహిత్యాన్ని చదివించకూడదనే భర్తలు కొన్ని వేల సంఖ్యలో ఉన్నారు. చలం సాహిత్యాన్ని జీర్ణం చేసుకుంటే తమ పురుషాధిపత్యం మంటగలిసి పోతుందనే సంకుచిత స్వభావం గల పురుషులు ఇప్పటికి కోకొల్లలు. పురుషాధి పత్యం ఉన్నంత కాలం, ఇప్పుడున్న వ్యవస్థ మారనంత కాలం ప్రతి తరంపైన చలం ప్రభావం కొనసాగుతూనే ఉంటుంది. ప్రతిరోజు గాలివీస్తున్నట్లు, సూర్యుడు ఉదయిస్తున్నట్లుగానే చలం స్త్రీ స్వేచ్ఛావాదం విస్తరిస్తూనే ఉంటుంది. ఆంధ్రదేశంలోని యేదో ఓ ఇంట్లో చలం భావాలు ఉదయిస్తూనే ఉంటాయి.

**ఆధార గ్రంథాలు :**

**చలం రచనలు :**

1. త్యాగం : రచనాకాలం : 1935, దేశిప్రచురణ. ప్రియదర్శిని ప్రచురణలు : 2011, బంజారాహిల్స్, హైదరాబాద్.
2. విడాకులు : ప్రథమ ముద్రణ : 1938, దేశిప్రచురణలు. ప్రియదర్శిని ప్రచురణలు : 2011, బంజారాహిల్స్, హైదరాబాద్.
3. చలం ఆత్మకథ : రచనాకాలం : 1973, రమణస్థాన్ పబ్లికేషన్స్, తారున్నామలై. ప్రియదర్శిని ప్రచురణలు : 2011, బంజారాహిల్స్, హైదరాబాద్.
4. చలంగారి ఉత్తరాలు : రచనాకాలం : 1947-77. బంకుపల్లి రామజోగారావు గారికి, అరుణా పబ్లికేషన్, విజయవాడ.
5. చలం-జీవతం-సాహిత్యం-గొర్రెపాటి వెంకట సుబ్బయ్య (రచయిత) : దేశికవితామండలి, విజయవాడ, 1958.